క్లుప్తంగా

చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ



చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న భాస్కరరావు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, ప్రముఖ చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు పలువురు చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. నెల రోజుల పాటు చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వైట్ పేపర్లు, రంగు పెన్సిల్స్, కలర్స్, ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

100 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్ క్రీడామైదానంలో మంగళవారం సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సిస్టర్ బిన్సీ, విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ చింతా ప్రభాకర్, పాస్టర్ ఇమాన్యుల్‌రాజు, టీడీపీ నాయకుడు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్‌టీం డిప్యూటీ డైరెక్టర్ పాపారావు

సీతంపేట: రైతుబజార్‌లో విక్రయించే అన్ని రకాల కూరగాయలు రైతుల నుంచి మాత్రమే తీసుకురావాలని, హోల్‌సేల్ వ్యాపారులు, దళారుల నుంచి కాదని విజిలెన్స్ టీం డిప్యూటీ డైరెక్టర్ పి. పాపారావు అన్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బజార్‌లో స్టాల్స్ పరిశీలించారు. రైతులు పండిస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటలే బజార్‌లో విక్రయించాలని, హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతుబజార్‌లో విక్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ , ఎస్.కె. యాసిన్, సెక్రటరీ అరుణ, అసిస్టెంట్ సెక్రటరీలు శ్రీలక్ష్మీ చైతన్య, బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.

వేద విజ్ఞానం మానవాళికి మార్గదర్శకం

ఎంవీపీకాలనీ: సనాతన భారతీయ మహాఋషులు అందించిన పురాణ, ఇతిహాస, వేదాల విజ్ఞానం మానవాళి మనుగడకు మార్గదర్శకమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగ శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్క్ వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో శ్రీ మహా గణపతి వైభవంపై మంగళవారం ఆయన అనుగ్రహభాషణం చేశారు. వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని విశదీకరించారు. ఋషులు అందించిన ఈ విజ్ఞానాన్ని ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాల ద్వారా ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం భక్తులతో మహా గణపతి మంత్రాలను చెప్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేవీఎస్ శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వీవీ ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్టదా?

తొలగించని వ్యర్థాలు

- పారిశ్రామిక ప్రాంతంలో గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ
- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- డంపింగ్ యార్డులుగా ఖాళీ స్థలాలు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఏ వీధిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతున్నాయి. చెత్త సేకరణకు ఏటా కోట్లు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేస్తున్నా చెత్త సమస్య మాత్రం గాడిలో పడడంలేదు.మురుగు పేరుకుపోయి కాలువలు కంపుకొడుతున్నాయి. వీటితో పాటు రోడ్లను నిత్యం శుభ్రం చేయకపోవడం, కాలువలు శుభ్రం చేసిన వెంటనే వ్యర్థాలను తరలించకపోవడంతో దుమ్మూధూళితో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.



చింతల్లోవ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

డంపింగ్ యార్డుగా ఖాళీ స్థలాలు

పారిశ్రామిక ప్రాంతంలోని పలు డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్ల వెంట మురుగు నీరు ప్రవహిస్తోంది. డంపర్ బిన్లు చెత్తతో నిండిపోతున్నా పట్టించుకునే నాధుడే లేడు. ఫలితంగా నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చెత్తతో నిండి డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. దీంతో దోమల బెడద తప్పడంలేదు.

జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలైన జైఆంధ్రకాలనీ, కాకరలోవ గ్రామాల ప్రజలు చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద విపరీతంగా ఉందని, చీకటి పడితే కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. దోమలు దాడి చేయడంతో రోగాల పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతో పాటు జంతువుల మృత కళేభరాలను సైతం ఇక్కడకు తీసుకువచ్చి వేయడంతో అంటురోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజుల తరబడి వ్యర్థాలు రోడ్డు మీదే...

కాకరలోవ, జైఆంధ్రాకాలనీ, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగిస్తున్నా వాటిని సకాలంలో తరలించడం లేదు. దీంతో మురుగు మొత్తం తిరిగి డ్రైనేజీల్లోనే పడుతుంది. ఎండకు ఎండిన వ్యర్థాలు గాల్లోకి తేలి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పరిసరాలు పాడవుతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం చెత్తను ఎప్పటికప్పుడు తరలించే చర్యలు మాత్రం చేపట్టడంలేదు.



కాకరల్లోవలోని ఓ ఇంటి వద్ద చెత్త

దోమల బెడద



డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం లేదు. దోమలు అధికమై రోగాలు బారిన పడుతున్నాం. రోజుల తరబడి చెత్త ఒకే చోట ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. నిత్యం కాలువలు శుభ్రం చేస్తే బాగుంటుంది. చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలి.

– లక్ష్మి, కాకరలోవ

కాలువలు శుభ్రం చేయాలి



పారిశుధ్య సిబ్బంది కాలువలను నిత్యం శుభ్రం చేస్తే బాగుంటుంది. వ్యర్థాలను తొలగించి వాటిని వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలి. ఇటీవల డ్రైనేజీలపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలి.

–సత్యవతి, క్రాంతినగర్

ఆటోడ్రైవర్ నిజాయితీ



బాధితుడికి బ్యాగ్ అందిస్తున్న ఆటో డ్రైవర్ శంకర్

గోపాలపట్నం: గోపాలపట్నం ఆటోస్టాండ్‌కు చెందిన ఓ డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను బాధితులకు తిరిగి అందించిన ఘటన సింహాచలం రైల్వే స్టేషన్ స్టాండ్‌లో చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ తెలిపిన వివరాలు..సోమవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నుంచి సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఓ కుటుంబం దిగింది. వీరు ఇక్కడి నుంచి ఆటోలో గాజువాక పతులుగారి మేడ ప్రాంతంలో దిగారు. ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. ఆటో డ్రైవర్ కూడా చూసుకోకుండా గోపాలపట్నం వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత ఆటోలో బ్యాగ్ బ్యాగ్ మర్చి పోయినట్టు గుర్తించి బాధితులు గోపాలపట్నం వచ్చారు. ఆటో డ్రైవర్ గురించి ఆరా తీశారు. అయితే అప్పటికే ఆటో డ్రైవర్ ఆటో స్టాడ్‌లో బ్యాగ్ మర్చిపోయిన విషయాన్ని సహచరులతో చర్చించాడు. బాధితులు వస్తే ఆందోళన చెందవద్దని బ్యాగ్ భద్రంగా ఉందని తెలియపరచండని చెప్పి మరో బుకింగ్‌కు వెళ్లాడు. బాధితులు మంగళవారం రావడంతో బ్యాగ్ అందించాడు.

గెడ్డలో పూడికల తొలగింపు



శ్రీనుబాబునగర్ గెడ్డలో పూడికలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధిలో పలు గెడ్డల్లో మంగళవారం పూడికలు తొలగించారు. ఇంజినీరింగ్ అధికారులు పూడికలు తొలగించకపోవడంతో స్థానికులు శానిటరీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శానిటరీ సిబ్బందితో గ్యాంగ్ వర్క్‌పెట్టి శుభ్రం చేయించారు. శ్రీరామ్‌నగర్, శ్రీనుబాబునగర్, రజక కాలనీ ప్రాంతాల్లో గెడ్డలో పూడికలు తొలగించారు. ఇది చూసిన వారు ఇంజినీరింగ్ అధికారులు చేయాల్సిన పనులు వీరి చేత చేయిస్తున్నారని విమర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే గణబాబు శ్రీరామ్‌నగర్‌లో పరిశీలించిన సమయంలో గెడ్డలోపూడికలు తీయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాని వారు కనీసం స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. గ్యాంగ్ వర్క్ ద్వారా పూడికలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్ రెడ్డి, ఇతర ఇంద్ర జాలికులు

డాబాగార్డెన్స్: ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం , ఇండియన్ మ్యాజిక్ అకాడమీ 10వ వార్షికోత్సవం ఈ నెల 23న అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి తెలిపారు. ఆ రోజున జూనియర్ పీసీ సర్కార్‌కు స్వర్ణాభిషేకం, ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం బీఎస్ రెడ్డి మాట్లాడుతూ కళాభారతి ఆడిటోరియం వేదికగా..ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి మూడున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్, అధునాతన మహేంద్రజాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ ఇంద్ర జాలికుడు పీసీ సర్కార్ జయంతి అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ ఏడాది పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు ఐఎంఏ జీన సాఫల్య పురస్కారంతో పాటు మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డులు ప్రదానం చేస్తామని బీఎస్ రెడ్డి తెలిపారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దేశం, ప్రపంచం నలుమూలల నుంచి ప్రఖ్యాత ఇంద్రజాల నిపుణుల ప్రదర్శనలతో పాటు అవార్డుల ప్రదానోత్సవం విశాఖకే గర్వకారణంగా నిలుస్తుందన్నారు. కళాకారుడు ధనుంజయ్ మాట్లాడుతూ ఉచిత పాస్‌లు ఆశీల్‌మెట్ట రామాటాకీస్ రోడ్డులో గల ధనుంజయ్ అవార్డ్స్ అండ్ గిఫ్ట్స్ షాప్ వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహణ కమిటీ సభ్యులు, మెజీషియన్లు అన్వర్ బాషా, అమర్నాథ్, విజయ్‌కుమార్, ప్రసాద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ శాంతి ప్రభ

మహారాణిపేట: దోమల వల్ల సంక్రమించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. మంగళవారం జగదాంబ వద్ద గల బిల్ జంక్షన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ వ్యాధులు దోమల వల్ల వస్తాయని, దోమల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులకు ఎన్.వి.బి.డి.సి.పి. ప్రోగ్రాం (నేషనల్ వెక్టార్ బోర్న్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం) కింద మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధులపై పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వివిధ విభాగాల అధికారులు బి.రమేష్, డాక్టర్ లూసీ, ఐ.మనోరమ, తులసి, మురళీకృష్ణ, శశిభూషణ్, రమేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- షిప్‌యార్డ్ మాజీ సొసైటీ కార్మికుల డిమాండ్

సింధియా: షిప్‌యార్డ్ సొసైటీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే తండ్రి సర్వీస్ సర్టిఫికెట్ ఉన్న వాళ్లనే నూతన కార్యవర్గంలో సభ్యులుగా ఉండేలా ఎంపిక చేయాలని పలువురు మాజీ సొసైటీ కార్మికులు కోరుతున్నారు. గతంలో నూతన కార్యవర్గ సభ్యులుగా నకిలీ సొసైటీ కార్మికులు ప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టడం వల్ల సొసైటీ పరిస్థితి దిగజారి పోయిందని ఆరోపిస్తున్నారు. 40 ఏళ్లుగా హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో సేవలు అందిస్తున్న మాజీ సొసైటీ ఉద్యోగుల నూతన కార్యవర్గంలో కీలక పదవులను ఉద్యోగుల కుమారులకు మాత్రమే కేటాయించాలని కోరుతున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ




రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

సింధియా: ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు మంగళవారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామ్మూర్తి, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు పి.జె.సి.హెచ్.బోస్, కె.ఎం.జి.గణేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 8.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్ రామారావు, ఆర్పీఎఫ్ /ఐపీఎఫ్ ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం, కోల్లాం జిల్లాకు చెందిన అమల్ ఎస్ఆర్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. నిందితుడిని జీఆర్పీ ఎస్‌ఐ ఎస్ రామారావుకు అప్పగించారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మహిళల భద్రతకు చట్టాలు దోహదం



మాట్లాడుతున్న ఏసీపీ పెంటారావు

డాబాగార్డెన్స్: మహిళల ఆత్మరక్షణకు ఎన్నో మార్గాలున్నాయని మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాల కోసం తెలుసుకోవాలని, ప్రేమ వ్యామోహంలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడితే మంచి వరుడు వస్తాడని, సోషల్ మీడియా ద్వారా అపరచిత వ్యక్తులను నమ్మి, వారితో ప్రేమ వ్యవహారాల్లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రిటైర్డ్ జడ్జి పైలా సన్నిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తారని, వారి ఆశలు వమ్ము చేయొద్దని, తల్లిదండ్రులను ప్రేమించి, వారి అడుగు జాడల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో సందీప్, కదారి కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, బండారు రామారావు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ మారువారం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కోలాటం ఆడుతున్న మహిళలు

విశాఖ విద్య: బుచ్చి రాజుపాలెం పరిసర 16 గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా కొలిచే పైడిమాంబ అమ్మవారి మారు వారం పండగను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ పురోహితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి పసుపు కుంకుమలు చీరలు సమర్పించి పూజలు చేశారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అమ్మ వారిని దర్శించుకున్నారు. బుచ్చిరాజుపాలెం గవరవీధి అవేంజర్స్ గ్రూప్ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ గౌరి కోలాట బృందం కోలాట ప్రదర్శనతో భక్తులను పరవశింప చేశారు. సాయంత్రం గంగరాజు ప్రవచనాలు ఆచరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాష్ రెడ్డి, మళ్ల చిన్న అప్పారావు, దొడ్డి సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• పందులతో అవస్థలు

పబ్లిక్ డిమాండ్



మల్కాపురం గెడ్డ వద్ద సంచరిస్తున్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి సమీపంలోని గెడ్డలో పందుల స్వైరవిహారం రోజు రోజుకూ అధికమవుతోంది. ఇతర ప్రాంతాల నుంచి కొంత మంది వ్యక్తులు పందులను ఇక్కడికి రాత్రి సమయంలో తీసుకువచ్చి విడిచిపెడుతున్నారు. ఇలా విడిచిపెట్టిన పందులు నివాసాల్లోకి చొరబడుతూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి పందులకు చెక్ పెట్టాలి.

– దొక్కడ సన్యాసిరావు (మల్కాపురం)

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాటం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం చేస్తామని, సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 142వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న పోర్టు, అందులో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్యంతో వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దీంట్లో నాలుగోవంతు ఖర్చుపెట్టినా హాస్పటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్స్, సిబ్బందిని నియమించవచ్చన్నారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో సత్యనారాయణ, ఎస్ సాధుబాబు, సీహెచ్‌వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.